సాక్షి ఖమ్మం

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, కల్యాణం



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీ సేవ నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కొత్తూరి జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా కేవీకేకు పురస్కారాలు



అవార్డు స్వీకరిస్తున్న సుచరితాదేవి

వైరా: వైరాలోని కృషివిజ్ఞాన కేంద్రానికి నాలుగు పురస్కారాలు లభించాయి. తమిళనాడులోని కోయంబత్తూరులో శనివారం అటారి జోన్-10 పరిధి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 72 కేవీకే అధికారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2024–25 ఏడాదిలో చేసిన కార్యక్రమాలపై చర్చించారు. వైరా కేవీకే ఆధ్వర్యాన నేరుగా వరి విత్తే పద్ధతిపై అవగాహన, రైతుల డేటా బేస్ నమోదు, శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు గాను నాలుగు అవార్డులు ప్రకటించగా కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితాదేవి అందుకున్నారు.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పోటీలకు 173 మంది



చెస్ పోటీలో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మంస్పోర్ట్స్: ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యాన ఎంపిక చేశారు. ఈమేరకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం 15క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా 320మంది ఉద్యోగులు హాజరయ్యారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన 173మందిని ఎంపిక చేసినట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తెలిపారు. వీరు ఈనెల 9, 10వ తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

'పరిషత్' ఓటర్లు.. 8,02,690మంది



ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా జిల్లాలో 8,02,690 మంది ఓటర్లు ఉన్నారని జెడ్పీ సీఈఓ దీక్షారైనా తెలిపారు. వీరిలో మహిళలు 4,14,425మంది, పురుషులు 3,88,243మంది, ఇతరులు 22మంది ఉన్నారని వెల్లడించారు. జెడ్పీతో పాటు మండల పరిషత్ కార్యాలయాల్లో జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనుండగా.. 9వ తేదీన పరిష్కరించి 10వ తేదీన ఓటర్లు, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను వెల్లడిస్తామని సీఈఓ పేర్కొన్నారు. అంతకుముందు 8వ తేదీన జిల్లా, మండల కేంద్రాల్లో వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

'స్వగృహ'కు రెండు బిడ్లు దాఖలు

ఖమ్మం సహకార నగర్: ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహలో ఫ్లాట్ల కేటాయింపునకు దరఖాస్తులు ఆహ్వానించగా రెండు బిడ్లు దాఖలయ్యాయి. ఉద్యోగ సంఘాల నుంచి ఒకటి, కాంట్రాక్టర్ నుంచి ఇంకొకటి దాఖలైనట్లు అధికారులు తెలిపారు. రాజీవ్ స్వగృహ 9.22 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, 576 ఫ్లాట్లలో చదరపు అడుగు ధర రూ.1,150గా ధర నిర్ణయించి బిడ్లు ఆహ్వానించారు. శనివారంతో గడువు ముగియగా ఉద్యోగ సంఘాలు, కాంట్రాక్టర్ నుంచి రూ.5కోట్లతో బిడ్లు దాఖలైనట్లు తెలిసింది. కాగా, దరఖాస్తులను అధికారులు సోమవారం పరిశీలించనున్నారు.



స్వామి ప్రతిమను భక్తితో ముద్దాడుతున్న మహిళ



మున్నేటిలో మునుగుతున్న గణపతి విగ్రహం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్ తదితరులు



ఖమ్మం బ్రాహ్మణబజార్ నుంచి మట్టి ప్రతిమను పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



శోభాయాత్రలో దప్పు వాయిస్తున్న మహిళ



మున్నేటిలో క్రేన్ ద్వారా విగ్రహాన్ని జారవిడుస్తున్న దృశ్యం



కాల్వొడ్డు వద్ద నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు

స్వామీ.. సెలవిక !

- జిల్లా కేంద్రంలో ఘనంగా వినాయక నిమజ్జనం
- ఆకట్టుకున్న శోభాయాత్ర, సాంస్కృతిక ప్రదర్శనలు
- కలెక్టర్, సీపీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఏర్పాట్లు
- వీక్షించేందుకు మున్నేటికి ఇరువైపులా జనం బారులు

జిల్లా కేంద్రంలో వాడవాడనా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నవరాత్రుల పూజల అనంతరం శనివారం నిమజ్జనం చేశారు. మున్నేటికి ఇరువైపులా నిమజ్జన ఘాట్లు ఏర్పాటు చేయగా మధ్యాహ్నం తర్వాత శోభాయాత్ర మొదలైంది. గాంధీచౌక్ వద్ద ప్రత్యేక వేదిక నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్, మేయర్ నీరజ, స్తంభాద్రి ఉత్సవ కమిటీల ప్రతినిధులు శోభాయాత్రకు స్వాగతం పలికి పూజలు చేశారు. ఇక మున్నేటి వద్ద నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్, సీపీతో పాటు కేఎంసీ కమిషనర్ అభిషేక్ పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయగా అర్ధరాత్రి వరకు కొనసాగిన నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది.

వైరా కారులో వార్!

నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో ఎవరి దారి వారిదే

- దిశానిర్దేశం లేక కేడర్‌లో నిస్తేజం
- జిల్లా పార్టీ అనుమతి లేకుండానే మండల కమిటీల ఏర్పాటు
- ఆపై రద్దు చేస్తూ జిల్లా అధ్యక్షుడి ప్రకటన



సాక్షిప్రతినిధి, ఖమ్మం: వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య పోరు జిల్లా పార్టీకి తలనొప్పులు తెస్తోంది. ఎవరి అనుమతి లేకుండానే నియోజకవర్గంలోని కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల కమిటీలను నియమించడం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉండగా అటు భద్రాద్రి, ఇటు ఖమ్మం జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకే జూలూరుపాడు కమిటీ ఎన్నిక జరిగిందని అక్కడి నేతలు ప్రకటించారు. కానీ ఎవరి ఆమోదం లేదని, ఇది పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనంటూ కమిటీలను రద్దు చేస్తూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటన విడుదల చేయడం గమనార్హం.

బహు నాయకత్వంతో గందరగోళం

భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) అధికారంలో ఉన్న పదేళ్లు వైరా నియోజకవర్గంలో బహు నాయకత్వం రాజ్యమేలింది. 2014 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున బానోతు చంద్రావతి పోటీ చేసి ఓడిపోగా.. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి గెలిచిన బానోతు మదన్‌లాల్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆపై 2018లో బానోతు మదన్‌లాల్ ఓడిపోగా, స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన రాములు నాయక్ బీఆర్‌ఎస్‌లోకి వచ్చారు. బీఆర్‌ఎస్‌లో మొదటి నుంచి ఉన్న నేతలకు ఆదరణ దక్కకపోగా.. ప్రతీ ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీలోకి వస్తుండడంతో నాయకులు పెరిగి పార్టీ కేడర్‌లో అసంతృప్తికి కారణమైంది. కాగా, బీఆర్‌ఎస్‌లో మదన్‌లాల్ తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నాక రాములునాయక్ చేరడంతో రాజకీయాలు మలుపు తిరిగాయి. పార్టీ కేడర్ రెండు వర్గాలుగా విడిపోవడమే కాక మదన్‌లాల్, రాములునాయక్ అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగానే నిర్వహించారు. అయినా జిల్లా, రాష్ట్ర నాయకత్వాలు వర్గపోరును ఆపలేకపోయాయి. చివరకు 2023లో పార్టీ తరఫున మదన్‌లాల్‌కు టికెట్ ఇచ్చినా విజయం దక్కలేదు.

చుక్కాని లేని నావలా..

అధికారంలో ఉండగా బహు నాయకత్వంతో ఇబ్బంది పడిన వైరా నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులు.. అధికారం కోల్పోయాక నాయకత్వ సమస్య ఎదుర్కొంటున్నాయి. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధిష్టానం మదన్‌లాల్‌కు టికెట్ ఇవ్వగా, సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్‌ను బుజ్జగించినప్పటికీ ఆయన రాజీనామా చేశారు. అయితే, మదన్‌లాల్‌కు ఓటమి ఎదురుకావడం, ఆపై ఆయన మృతితో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు నాయకత్వం కరువైంది. ప్రతిపక్షంలో ఉండడంతో ఏ ఆందోళన నిర్వహించాలన్నా సమన్వయం చేసే వారు లేకపోగా, మండల కమిటీల నియామకం కూడా కొన్నిచోట్ల జరగలేదు.

ఎవరికి వారే..

ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్‌లో నైరాశ్యం నెలకొని, పార్టీ కేడర్‌ను పట్టించుకునే నాయకుడు కరువయ్యాడు. ఈక్రమంలోనే మండల కమిటీలు లేకపోగా అటు రాష్ట్ర, ఇటు జిల్లా అధిష్టానం అనుమతి లేకుండానే జూలూరుపాడు, ఏన్కూరు, కొణిజర్ల మండల కమిటీలను నియమించుకోవడం వివాదాస్పదమైంది. జూలూరుపాడులో గత నెల 31న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు రేగా కాంతారావు, తాతా మధుసూదన్ అనుమతితో కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పగా, ఆతర్వాత ఏన్కూరు, కొణిజర్ల మండల కమిటీలు కూడా ఏర్పాటయ్యాయి.

ఆ నియామకాలు చెల్లవు

మండల కమిటీల నియామకాలు చెల్లవని తాజాగా బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ ప్రకటించారు. అధిష్టానం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకాలు జరగుతాయని, అప్పటి వరకు చేపట్టే నియామకాలు చెల్లవని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది.

గేమ్ చేంజర్‌గా ఖమ్మం-దేవరపల్లి హైవే

- కొత్త సంవత్సరంకల్లా అందుబాటులోకి రహదారి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పనులపై సూచనలు చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్: ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే తెలంగాణ నుంచి దక్షిణ భారతదేశానికి మధ్య రవాణా సౌకర్యం మెరుగై గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం ధంసలాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే ఆర్‌ఓబీ, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లను కలెక్టర్ అనుదీప్, అధికారులతో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. హైవే నిర్మాణ పనులు వేగంగా చేపడుతూ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ధంసలాపురం ఆర్‌ఓబీని నవంబర్ చివరి నాటికి ఓ వైపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరంలో హైవే అందుబాటులోకి వస్తే 160 కి.మీ. పొడవైన ఈ రహదారి మీదుగా రాజమండ్రికి గంటన్నరలో చేరుకోవచ్చని తెలిపారు. ఖమ్మం-సత్తుపల్లి మార్గంలో సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని మంత్రి చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్‌కు సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నేషనల్ హైవే పీడీ దివ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ యాకూబ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్, ఆర్డీఓ నర్సింహారావు, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, ఆళ్ల నిరీషాఅంజిరెడ్డి, కమర్తపు మురళి, సొసైటీల చైర్మన్లు తుపాకుల యలగొండ స్వామి, రావూరి సైదాబాబు, తహసీల్దార్ సైదులు, నాయకులు సాదు రమేష్‌రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, బోడా శ్రావణ్‌కుమార్, ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీచర్ చొరవతోనే కలెక్టర్ అయ్యా...

- గురుపూజోత్సవంలో కలెక్టర్ అనుదీప్
- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



చెన్నూరు పీఎస్ ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్ష తదితరులు

ఖమ్మం సహకారనగర్: చిన్నతనంలో తనకు ఇంగ్లిష్ బోధించిన టీచర్ చూపించిన చొరవతోనే తాను కలెక్టర్ స్థాయికి ఎదిగానని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సమాజంలో చాలామంది జీవితాల్లో వెలుగు నింపే అవకాశం ఉపాధ్యాయులకు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో గురుపూజోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ సన్మానించి మాట్లాడారు. కరోనా సమయాన ఆన్‌లైన్ బోధనతో పిల్లల విద్యా ప్రమాణాలు సగానికి పైగా పడిపోవడంతో ఉపాధ్యాయుల ప్రాధాన్యత అందరికీ తెలిసిందని చెప్పారు. తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్ రూమ్ అదనపు సౌకర్యం మాత్రమేనని.. టీచర్లే కేంద్రంగా బోధన సాగితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉన్నందున, ఇదే స్ఫూర్తిని బోధనలో కొనసాగిస్తే మరిన్ని ఫలితాలు సాధించొచ్చని తెలిపారు. ఎమ్మెల్సీ పి.శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఉపాధ్యాయులకు సమస్యలు ఉన్నా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దారని చెప్పారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడగా జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, సీఎంఓ ప్రవీణ్‌కుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, డీసీఈబీ సెక్రటరీ కనపర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత మధ్య నిమజ్జనం



నిమజ్జనం చేస్తున్న సీపీ సునీల్‌దత్ దంపతులు

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రత మధ్య వినాయక నిమజ్జనం శనివారం ప్రశాంతంగా కొనసాగింది. పలువురు మండపాల నిర్వాహకులు ఆలస్యంగా బయలుదేరడంతో అర్ధరాత్రి వరకు కూడా నిమజ్జనాలు కొనసాగాయి. 500 మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేయడం, ముందస్తు ప్రణాళికతో ఇక్కట్లు ఎదురుకాలేదు. కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అగస్త్యతో కలిసి సీపీ సునీల్‌దత్ ఏర్పాట్లను పరిశీలించారు. సీపీ దంపతులు మట్టి ప్రతిమను నిమజ్జనం చేశారు. అడిషనల్ డీసీపీలు ప్రసాద్‌రావు, కుమారస్వామి, విజయబాబు, ఏసీపీలు రమణమూర్తి, సాంబరాజు, సుశీల్‌సింగ్, సీఐ కరుణాకర్ బందోబస్తును పర్యవేక్షించారు.

క్లుప్తంగా

నేటి నుంచి సాగునీటి నిలిపివేత

కల్లూరురూరల్: మధిర బ్రాంచ్ సాగర్ కెనాల్‌కు ఆదివారం నుంచి 12వ తేదీ వరకు సాగునీరు నిలిపివేయనున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వారబందీ విధానం అమలు చేస్తున్నందున ఆరు రోజుల పాటు నీటి విడుదల ఉండదని పేర్కొన్నారు. తిరిగి 13 నుంచి 18వ తేదీ వరకు నీరు సరఫరా చేస్తామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో మేకల కాపరి మృతి

తిరుమలాయపాలెం: మేకలు మేపేందుకు వెళ్లి చెట్టుకొమ్మలు కొడుతున్న క్రమాన విద్యుదాఘాతానికి గురైన కాపరి మృతి చెందాడు. మండలంలోని ఇస్లావత్‌తండాకు చెందిన ఇస్లావత్ సక్లాల్ (26) వ్యవసాయంతో పాటు మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం మేకలతో అడవికి వెళ్లిన ఆయన చెట్ల కొమ్మలు కొట్టి వేస్తుండగా, ఆపైన ఉన్న విద్యుత్ లైన్ తాకడంతో షాక్‌కు గురై పక్కనే బావిలో పడ్డాడు. కొద్దిసేపటికి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని బయటకు తీయించారు. సక్లాల్‌కు భార్య సరిత ఉంది. ఆయన తండ్రి నాగులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం


సైదారావు (ఫైల్)

ముదిగొండ: వినాయకుడి నిమజ్జనానికి వెళ్లి మండలంలోని మాధాపురం చెరువులో శుక్రవారం గల్లంతైన పడిశాల సైదారావు (24) మృతదేహాన్ని శనివారం గుర్తించారు. స్థానికులు శుక్రవారం రాత్రి వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలించగా మృతదేహం లభ్యమైంది. ఘటనపై ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డీజే సౌండ్‌కు కుప్పకూలిన మహిళ

నేలకొండపల్లి: వినాయక నిమజ్జనంలో ఏర్పాటు చేసిన డీజే శబ్దంతో ఓ మహిళ అస్వస్థతకు గురైంది. మండలంలోని మంగాపురంతండాలో శనివారం రాత్రి గణేశ్ శోభాయాత్ర జరుగుతుండగా డీజే పాటలకు అనుగుణంగా భూక్యా పార్వతి నృత్యం చేస్తోంది. ఈ క్రమంలో ఆమె కుప్పకూలగా స్థానికంగా చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అలాగే, మండల కేంద్రంలో వినాయక శోభాయాత్రలో భాగంగా బాణసంచా కాల్చేక్రమాన ప్రమాదంజరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.

మృత్యుకుహరాలు

జిల్లాలో పంటల సాగుకు కీలకంగా నిలుస్తున్న సాగర్ కాల్వలు వందల కి.మీ. మేర ఉన్నాయి. ప్రధాన కాల్వలే కాక మినీ కాల్వలు, బ్రాంచ్ కెనాళ్లతో పంటలకు సాగు నీరు అందుతోంది. అయితే, పలుచోట్ల కాల్వల వెంటే రహదారులు ఉండడం.. సరైన రక్షణ చర్యలు లేకపోవడం.. కొన్ని చోట్ల బ్రిడ్జిలు ఇరుకుగా మారడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. రెయిలింగ్, రక్షణ గోడలు ఉన్న చోట శిథిలావస్థకు చేరడం ప్రమాదాలకు కారణమవుతోంది. తాజాగా ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెం వద్ద శుక్రవారం రాత్రి సాగర్ కాల్వలోకి కారు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ నేపథ్యాన జిల్లాలోని సాగర్ కాల్వల వెంట పరిస్థితులపై కథనం..



ఖమ్మంరూరల్: గొల్లగూడెం రెయిలింగ్, దిమ్మెలు లేని సాగర్ కాల్వ

- జిల్లాలో వందల కి.మీ. మేర సాగర్ కాల్వలు
- వీటి వెంటనే ప్రధాన రహదారులు
- పలుచోట్ల రెయిలింగ్, రక్షణ గోడలు లేక నిత్యం ప్రమాదాలు

ఖమ్మంరూరల్‌లో..

ఖమ్మంరూరల్: ఖమ్మం నుంచి వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిలోని గొల్లగూడెం సమీప సాగర్ కాల్వపై వంతెన వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ కాల్వపై ఒకే వంతెన ఇరుకుగా ఉండటమే కారణమవుతోంది. ఈ కాల్వలోకి ప్రైవేట్ బస్సు, కార్లు దూసుకెళ్లి పలువురు మృత్యువాత పడ్డారు. దీంతో అధికారులు పాత బ్రిడ్జిని నవీకరించడంతో పాటు మరో కొత్త బ్రిడ్జి నిర్మించారు. కానీ, కాల్వ పక్కభాగంలో రెయిలింగ్ లేదా దిమ్మెలు నిర్మించకపోవడంతో ప్రమాదాలు ఆగడం లేదు.

రెయిలింగ్ నిర్మించాలి.



ఇక్కడి బ్రిడ్జిల పైనుంచి వెళ్తున్న పలు వాహనాలు ప్రమాదాలకు గురై అమాయకుల ప్రాణాలు పోతున్నాయి. గతంలో ఉన్న ఇరుకు బిడ్జిని వెడల్పు చేసి రెండు బిడ్జిలు నిర్మిచడం బాగుంది. అయితే సాగర్ కాల్వకు ఇరు వైపులా రెయిలింగ్ కానీ, దిమ్మెలు కానీ నిర్మిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. –గణపారపు శ్రీను, గొల్లగూడెం

అడుగడుగునా గుంతలే..

నేలకొండపల్లి: మండలంలో సాగర్ కాల్వ మోటాపురం నుంచి ఆరెగూడెం వరకు సుమారు పది కిలోమీటర్ల మేర ఉంది. కాల్వ వెంట రహదారిపై గుంతలు పడడంతో అధ్వానంగా మారింది. బైక్‌లు తప్ప ఇతర వాహనాలు వెళ్లే మార్గం లేదు. పలుచోట్ల రహదారిని కంపచెట్లు కమ్మేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అమ్మగూడెం తూముల వద్ద ఇరుకు వంతెన కావటంతో ప్రమాదం పొంచి ఉంది.


నేలకొండపల్లి: అమ్మగూడెం లాక్ వద్ద ఇరుకుగా ఉన్న వంతెన


కూసుమంచి: ప్రమాదకరంగా ఉన్న పాలేరు రిజర్వాయర్ కట్ట

కూసుమంచిలో..

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం ఇన్‌ఫాల్ రెగ్యులేటరీ కాల్వకు రక్షణ గోడ నిర్మించినా.. ప్రస్తుతం గేట్ల పక్కన ఉన్నవంతెన రెయిలింగ్ శిథిలం కావటం, పాలేరు రిజర్వాయర్ చిన్న కాల్వ సమీపంలో రెయిలింగ్ ధ్వంసం కావటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఔట్ ఫాల్ కాల్వ, మినీ హైడల్ ప్రాజెక్టు కాల్వల వద్ద వాహనాలు వెళ్లే పక్కన రెయిలింగ్ లేదు. పాలేరు అలుగుల్లో కాజ్‌వేకు రెయిలింగ్ వరదలకు ధ్వంసమైంది.

నగరంలో..


ఖమ్మం టేకులపల్లి వంతెన వద్ద ప్రమాదకరంగా సాగర్ కాల్వ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7, 9, 10వ డివిజన్ల జంక్షన్‌గా ఉన్న ఇందిరానగర్ –టేకులపల్లి మధ్య ప్రధాన రహదారి అనుకొని ఓ వైపు దేవాలయం, మరో వైపు టేకులపల్లి వంతెన, దాని పక్కనే సాగర్ ప్రధాన కాల్వ ఉంటాయి. రోడ్డు వెడల్పుగా లేకపోవడం, కీలక జంక్షన్ కావడంతో విపరీతమైన రద్దీ ఉంటోంది. కాల్వ వైపు ఫెన్సింగ్ తాత్కాలికంగా ఏర్పాటు చేసినా, రక్షణ గోడ లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. అలాగే, రఘునాథపాలెంమండలంలోని వీ.వీ.పాలెం–చింతగుర్తి రహదారిపై సాగర్ కాల్వపై నిర్మించిన పాత వంతెన కూడా శిథిలావస్థలో ఉంది.

కల్లూరులో..


కల్లూరు: డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లే మార్గంలో కాల్వ కట్ట

కల్లూరు: కల్లూరులోని ఎన్‌ఎస్‌పీ బ్రిడ్జి వద్ద కాల్వ కట్టకు ఫెన్సింగ్, రెయిలింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సాగర్ మధిర బ్రాంచ్ కాల్వ కట్ట పక్కన 100 వరకు డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో స్థానికులు నివసిస్తున్నారు. మరో వైపు సబ్‌స్టేషన్‌కు వెళ్లే దారి ఉండగా.. ఫెన్సింగ్ లేకపోవడంతో కాస్త అదుపు తప్పినా కాల్వలో పడే ప్రమాదం ఉంది.

బోనకల్‌లో..


బోనకల్‌లో ప్రమాదకరంగా మారిన రెయిలింగ్

బోనకల్: మండల కేంద్రానికి సమీపాన బోనకల్ బ్రాంచ్ కెనాల్ రెయిలింగ్ ప్రమాదకరంగా మారింది. ఈ కాల్వ బోనకల్ నుంచి ఖమ్మం ప్రధాన రహదారిపై ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వపై బ్రిడ్జికి రెండు వైపులా రెయిలింగ్ తక్కువ ఎత్తులో ఉండటం, మూలమలుపు కావడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు.

కొణిజర్లలో..


బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న ద్విచక్రవాహనం

కొణిజర్ల: కొణిజర్ల – తనికెళ్ల బోడియాతండా మధ్య ప్రవహిస్తున్న ఎన్నెస్పీ ప్రధాన కాల్వపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జికి రెండువైపులా రెయిలింగ్ ధ్వంసం కావడం.. ఈ మార్గంలో వందలాది వాహనాల రాకపోకలతో ఎప్పుడు ఏం జరుగుతుందో భయపడుతున్నారు. సరిగ్గా బ్రిడ్జి వద్దే మూలమలుపు ఉండడం.. అక్కడకు వచ్చే వరకు బ్రిడ్జి ఉన్నట్లు తెలియకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. ఏడాది క్రితం వైరాకు చెందిన ఇద్దరు ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాక్టర్‌తో కాల్వలో పడి మృతి చెందినా.. అధికారులు కనీస మరమ్మతులు చేయించలేదు.

కడదాకా సిద్ధాంతాన్ని వీడని రమేశ్

మాజీ కౌన్సిలర్ సంతాప సభలో తమ్మినేని వీరభద్రం


రమేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టు ఉద్యమం, సిద్ధాంతాలు బలహీనపడిన పరిస్థితుల్లో ఉద్యమాన్ని అంటిపెట్టుకుని కడవరకు నిలిచిన నర్రా రమేశ్ చిరస్మరణీయుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. అయితే, కమ్యూనిస్టు ఉద్యమం చిగురిస్తున్న సమయంలో ఆయన మృతి బాధాకరమన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ఆస్పత్రిలో శనివారం మృతి చెందిన మాజీ కౌన్సిలర్, సీపీఎం నాయకుడు నర్రా రమేశ్ (58) సంతాప సభ పార్టీ జిల్లా కార్యాయలంలో నిర్వహించారు. ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించాక తమ్మినేని మాట్లాడుతూ.. కమ్యూనిస్టు, సోషలిస్టు వ్యతిరేకి అయిన ప్రధాని మోదీ ఇప్పుడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా ప్రధాని పుతిన్ కలిసి ఫ్రంట్ ఏర్పాటుకు సిద్ధమవడమే కమ్యూనిస్టు ఉద్యమానికి మంచిరోజులు వచ్చాయనేందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రమేశ్ మృతి బాధాకరమని, విద్యార్థి, యువజన ఉద్యమంలో కీలకంగా వ్యవహరించాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తెలిపారు. కాగా, నర్రా రమేశ్‌కు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉండగా నాగలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. సంతాప సభలో కార్పొరేటర్లు యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, బి.వెంకట్‌కుమార్, నాయకులు వై.విక్రమ్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేశ్, అన్నవరపు సత్యనారాయణ, పి.రాజారావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, నాగరాజు, సీపీఐ, మాస్‌లైన్, బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు శింగు నర్సింహారావు, మువ్వా శ్రీనివాసరావు, సీవై.పుల్లయ్య, ఆవుల అశోక్, డాక్టర్ చీకటి భారవి, పగడాల నాగరాజు, శీలంశెట్టి రమావీరభద్రం, మెంతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లడ్డూలకు భారీ వేలం..


సత్తుపల్లి: లడ్డూతో కేశవరెడ్డి

సత్తుపల్లి: స్థానిక జేవీఆర్ పార్కు ఎదురుగా శ్రీ ప్రసన్నగణపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మహాగణపతి చేతిలోని లడ్డూను శనివారం వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మండలం నారాయణపురానికి చెందిన మందపాటి కేశవరెడ్డి రూ.4.05 లక్షలకు లడ్డూ దక్కించుకున్నారు. నిర్వాహకులు కూసంపూడి శ్రీనివాసరావు, గుడిపూడి గాంధీ, దారా ఏకాదశమూర్తి, నాయుడు వెంకటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

అంజనాపురంలో రూ.1.61 లక్షలు

కొణిజర్ల: మండలంలోని అంజనాపురం (కొత్తూరు)లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. రూ.1,61,916తో కన్నేటి గోపాల్‌రావు, నాగేశ్వరరావు కలిసి దక్కించుకున్నారు.

మధిరలో రూ.73వేలు

మధిర: మధిరలోని రైల్వే గేట్ సెంటర్ శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనం చేశారు. వేలాదిగా భక్తులు పాల్గొనగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా లడ్డూను రూ.73వేలకు రమేష్‌రెడ్డి దక్కించుకున్నారు.


కొణిజర్ల: లడ్డూతో భక్తులు

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

ఆర్థిక లావాదేవీల్లో వివాదం


డీవీ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

- ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ బావమరిది ఆత్మహత్య
- పంచాయితీలో వేధించారని డీవీపై ఫిర్యాదు


శ్రీనివాసరావు (ఫైల్)

ఇల్లెందు/కారేపల్లి: ఆర్థిక లావాదేవీల్లో ఏర్పడిన విబేధాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా.. మృతుడు, ప్రముఖ కాంట్రాక్టర్ గడిపర్తి శ్రీనివాసరావు(53).. ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు (డీవీ)కు వరుసకు బావమరిది కావడం, ఘటనకు డీవీనే కారణమంటూ ఆయన బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. ఇల్లెందు కాకతీయనగర్‌కు చెందిన గడపర్తి శ్రీనివాసరావు – డీవీ కలిసి కొన్నేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం, కాంట్రాక్టు పనులు చేస్తుండగా ఏడాది నుంచి వివాదం మొదలైంది. డీవీ తనకు రూ.కోటిన్నర ఇవ్వాలని శ్రీనివాసరావు చెప్పినట్లు తెలుస్తుండగా, ఇదే విషయమై ఖమ్మంలో శుక్రవారం పెద్దల సమక్షాన పంచాయితీ నిర్వహించినట్లు తెలిసింది. అక్కడ ఆయనను కొందరు దూషించినట్లు సమాచారం. అంతేకాక డీవీ అనుచరుడు దమ్మాలపాటి ప్రసాద్, ఆయన కుటుంబీకులు శ్రీనివాసరావు, ఆయన భార్య విషయంలో అసభ్యంగా మాట్లాడడంతోపాటు బాకీ రూ.కోటిన్నరలో రూ.49లక్షలే ఇవ్వాలని నిర్ణయించినట్లు పలువురితో ఫోన్‌లో చెప్పుకుని వాపోయినట్లు తెలిసింది. ఆతర్వాత ఏం జరిగిందో కానీ కారులో ఇల్లెందు బయలుదేరిన శ్రీనివాసరావుకు రమ రాత్రి 10 గంటల తర్వాత ఫోన్ చేయగా కారేపల్లి క్రాస్ రోడ్‌కు వచ్చినట్లు చెప్పిన ఆయన ఆతర్వాత ఇంటికి చేరకపోగా ఫోన్ కూడా తీయలేదు. ఈక్రమంలోనే కుటుంబీకులు వెతుకుతుండగా కారేపల్లి – ఇల్లెందు మండలాల సరిహద్దు మొట్లగూడెంలోని ఆయన తోట వద్ద కారును గుర్తించారు. అందులో పరిశీలించగా కూర్చున్న స్థితిలోనే మృతి చెంది ఉండడం, పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు.

డీవీ ఇంటి ఎదుట ఆందోళన

శ్రీనివాసరావు ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించగానే కారేపల్లి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఇల్లెందు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కానీ ఘటనకు దమ్మాలపాటి వెంకటేశ్వరరావే కారణమంటూ మృతదేహాన్ని ఇల్లెందులోని ఆయన నివాసం వద్దకు తరలించారు. డీవీ ఇంటి ఆవరణలో మృతదేహాన్ని పెట్టి ఆందోళన ఆందోళన నిర్వహించారు. డీవీ వాహనం, ఫర్నీచర్‌ను సైతం ధ్వంసం చేయగా ఇల్లెందు సీఐ సురేష్, కారేపల్లి ఎస్‌ఐ బి.గోపి, సిబ్బంది అడ్డుకుని ఆస్పత్రికి తరలించారు. కాగా, శ్రీనివాసరావు ఆత్మహత్యకు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కుటుంబసభ్యులు, దమ్మాలపాటి ప్రసాదే కారణమంటూ మృతుడి భార్య రమ ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలో పంచాయితీలో ఉందని సమీప బంధువులు పాకాలపాటి చంద్రయ్య, భారతీరాణి తదితరులతో వెళ్లిన శ్రీనివాసరావు మృతదేహంగా రావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.గోపి తెలిపారు. కాగా, ఇల్లెందు ఆస్పత్రిలో శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సందర్శించి కుటుంబీకులను ఓదార్చారు. అయితే, ఖమ్మంలో శుక్రవారం రోజంతా నగదు విషయమై పంచాయితీ జరిగిందని సమాచారం. ఈక్రమాన తనకు రావాల్సిన రూ.1.50కోట్లకు బదులు రూ.49లక్షలే ఇస్తామనడం, పలువురు దూషించడంతోనే శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

డీవీ భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

ఇల్లెందు: సుమారు 50 మందితో ఇంటికి మీదకు వచ్చి దాడి చేసినవారిపై, అందుకు ప్రోత్సహించిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు భార్య బేబి భార్గవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగిరెడ్డి, జానీపాష ప్రోద్బలంతో మీర్జం బేగ్, గడపర్తి వెంకటేశ్వర్లు, దుద్దుకూరి రోశమ్మ, శృతి, చింతనిప్పు కృష్ణారావు, చింతనిప్పు రాంబాబుతో మరికొందరు తమ ఇంటికి వచ్చి అద్దాలు, తలుపులు ధ్వంసం చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దమ్మపేట మండలం తొట్టిపంపునకు చెందిన కొర్సా నవీన్ (26) శుక్రవారం రాత్రి సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం వద్ద ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

కూసుమంచి: మండలంలోని చౌటపల్లికి చెందిన నూకల సాయి కుమార్ (23)ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన శుక్రవారం పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆర్థికసమస్యల కారణంగానే సాయి ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమ విఫలమైన యువకుడు..

కూసుమంచి: మండలంలోని మునిగేపల్లికి చెందిన తుపాకుల సిద్ధూ (25) శనివారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కొన్నాళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తుండగా, ఆమె నిరాకరించినట్లు తెలిసింది. దీంతో సిద్ధూ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తండ్రి హుస్సేన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో కుక్కలుదాడి చేయగా లేగదూడ మృతి చెందింది.గ్రామానికి చెందిన రైతు తెల్లగొర్ల అనిల్ అప్పుడే పుట్టిన లేగదూడను శనివారం పశువుల కొట్టంలో పడుకోబెట్టాడు. ఈక్రమాన కుక్కల గుంపు దాడిచేసి దూడనుఈడ్చుకెళ్లి దాడి చేయడంతో చనిపోయింది. మరికొన్ని పశువుల వెంట పడడంతో స్థానికులు స్పందించగా కుక్కలు పారిపోయాయి.